సాక్షి
వికారాబాద్

ఆదివారం । 5 । జనవరి । 2025



పాఠం చెప్పేదెవరు..?

డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో కేజీబీవీల్లో పాఠాలు చెప్పే వారు కరువయ్యారు. 8లో▸



పకడ్బందీగా వ్యవసాయ..

రైతుల సమగ్ర వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి సూచించారు. 8లో▸



నాట్లు షురూ!

యాసంగి పంటకాలం ప్రారంభమైంది. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కల్తీలేని సరుకులు అందించడమే లక్ష్యం

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తంరావు

తాండూరు: ఉత్పత్తిదారు నుంచి వినియోగదారుడికి కల్తీ లేని సరుకులు అందించడమే మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ సహకార సంఘం లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కనీనర్ పుటం పురుషోత్తం రావు అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని సంఘం తాండూరు అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకే సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం 25 మందితో జిల్లా స్థాయి డైరెక్టర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, యువజన నాయకులు నరేష్, శ్యాంరెడ్డి, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైంది

పంజగుట్ట: సనాతన ధర్మం అంటే ఎప్పటికప్పుడు తమలోని విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ కాలంతో పాటు ధర్మాన్ని ఆచరించడమేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భాగ్యనగర్ భారతీయ సాంస్కృతిక సమ్మేళనం శనివారం రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. చాలా మంది ధర్మం అంటే మతం మాత్రమేనని అపోహలో ఉన్నారని.. ధర్మం అంటే అన్ని మతాలను, కులాలను, వర్గాలను సమ దృష్టితో చూస్తూ వారందరినీ ప్రగతిలో భాగస్వాములను చేయడమేనన్నారు. భారతీయ సంస్కృతి ఎంత ఉన్నతమైందో సనా తన ధర్మం కూడా అంతకంటే ఉన్నతమైందన్నారు. ప్రస్తుత తరుణంలో చంద్రుడిపైకి ఎలా వెళ్లాలనేది నేర్చుకున్నాం కానీ ఐకమత్యంతో అందరూ కలిసి ఎలా జీవించాలి అనే విషయంలో ఇంకా పూర్తి స్థాయిలో నేర్చుకోలేదని అనిపిస్తోందన్నారు. సర్వేజన సుఖినో భవంతు అనే భావనను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో భగవంతుడున్నాడని, అదే విధంగా అన్ని చోట్లా భగవంతుడు ఉన్నాడనే భావన భారతీయ సంస్కృతిలోనే మిళితమై ఉందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉపాధిహామీ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డిని ఉపాధి హామీ ఉద్యోగులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌డీఓ శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కందుకూరి నాగభూషణం నాయకత్వంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు నోటుబుక్స్, పెన్నులు, టవల్స్ అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ చరణ్‌గౌతమ్, ఎఫ్‌ఎం శారద, సూపరింటెండెంట్ ప్రసాద్, జేఏసీ నాయకులు రవీందర్‌రెడ్డి, వీరాసింగ్, లలిత, నర్సిములు, తిరుపతాచారి, రవికుమార్, విమల, శివశంకర్‌రెడ్డి, సంధ్య, కరుణశ్రీ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ డిగ్రీ మహిళా కళాశాల (వికారాబాద్)లో ఉపాధ్యాయుల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ తెలిపారు. డీఎల్ కంప్యూటర్ సైన్స్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఒర్జినల్ సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

రోడ్లకు మహర్దశ

రూ.391 కోట్లతో పనులు
- టెండర్లకు నోటిఫికేషన్ జారీ
- రూ.120 కోట్లతో పరిగి – షాద్‌నగర్ రోడ్డు నాలుగు లేన్లుగా విస్తరణ
- మరో రూ.120 కోట్లతో వికారాబాద్ – పరిగి రహదారి అభివృద్ధి
- రూ.100 కోట్లతో గడిసింగాపూర్ – రంగారెడ్డిపల్లి రోడ్డు పనులు
- ఏడాదిన్నరతో పూర్తి చేయాలనే నిబంధన



వికారాబాద్: జిల్లాలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. రహదారుల విస్తరణ పనులకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. రోడ్లు భవనాల శాఖ టెండర్ల కోసం ఈ నెల ఒకటిన నోటిఫికేషన్ జారీ చేసింది. 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు వేసుకునేందుకు అవకాశం ఉంది. నాలుగు జిల్లాల పరిధిలో ఎనిమిది పనులకు గాను ప్రభుత్వం రూ.1,285 కోట్లు వెచ్చించనుంది. ఇందులో వికారాబాద్ జిల్లాకు అత్యధికంగా రూ.391 కోట్లు కేటాయించారు. ఈ నెలలో టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెల నుంచి పనులను ప్రారంభించాలని భావిస్తున్నారు. ఏడాదిన్నరలోపు పనులు పూర్తి చేయాలని గడువు విధించినట్లు అధికారులు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో ఎక్కువ శాతం పనులు జరగనున్నాయి. వీటితోపాటు తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలకు అనేక రోడ్లు మంజూరయ్యాయి. త్వరలో వీటికి కూడా టెండర్లు పిలవనున్నారు.

చేపట్టనున్న రోడ్లు ఇవే..

- పరిగి – షాద్‌నగర్ రోడ్డును కొంత కాలంగా బెంగళూరు – ముంబై హైవే లింకు రోడ్డుగా వినియోగిస్తున్నారు. ఆరేళ్లుగా ఈ మార్గంలో రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.120 కోట్లు ఖర్చు చేయనుంది.
- పరిగి – వికారాబాద్ రెండు వరుసల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.120 కోట్లు వెచ్చించనున్నారు. ఈ మార్గంలో రూ.7 కోట్లతో వంతెన నిర్మిస్తారు.
- పరిగి నియోజకవర్గంలోని గడిసింగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం రంగారెడ్డిపల్లి వరకు ఉన్న రోడ్డును రెండు వరుసలుగా విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.100 కోట్లు కేటాయించారు.
- పరిగి నియోజకవర్గం పరిధిలోని చిట్టెంపల్లి గేట్ నుంచి కంకల్ మీదుగా షాద్‌నగర్ నియోజకవర్గం లాల్‌పహాడ్ వరకు గల రోడ్డును రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. దీని కోసం రూ.30 కోట్లు మంజూరయ్యాయి.
- పరిగి మండలం తుంకలగడ్డ నుంచి లఖ్నాపూర్ ప్రాజెక్టు వరకు గల సింగిల్ రోడ్డును రూ.7 కోట్లతో రెండు వరుసలుగా అభివృద్ధి చేస్తారు.
- వీటితో పాటు పరిగి మున్సిపల్ పరిధిలో రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి కోసం రూ.16 కోట్లు, రూ.5 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణం చేపట్టనున్నారు. మరో రూ.101 కోట్లతో వికారాబాద్ – తాండూరు రోడ్డును విస్తరించనున్నారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.300 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు మంజూరు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటం కలిసొచ్చింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎంకు ఈ ప్రాంత అవసరాలు తెలియజేసి నిధులు మంజూరయ్యేలా చూస్తున్నారు.

సీఎం ప్రత్యేక చొరవతో..



బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జిల్లా అన్ని విధాలా వెనుకబాటుకు గురైంది. రోడ్ల అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుత సీఎం జిల్లా వాసి కావడం కలిసొచ్చింది. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వగ్దానాలు నెరవేరుస్తాం. త్వరలో మరిన్ని నిధులు తెచ్చి జిల్లాను అభివృద్ధి చేస్తాం. ట్రిపుల్‌ఆర్ జిల్లా అభివృద్ధిలో కీలకం కానుంది.

– టీ రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

సావిత్రి స్ఫూర్తి.. ఉపాధ్యాయ కీర్తి

- కష్టాలను జయించి.. సమాజానికి దిక్సూచిగా..
- టీచర్లుగా రాణిస్తూ అందరికీ ఆదర్శంగా..



పేదరికం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ సమస్యలు చుట్టుముట్టినా వారి విజయాన్ని అడ్డుకోలేకపోయాయి.. పట్టుదల.. అకుంఠిత దీక్షతో ముందుకు సాగారు.. ఎంచుకున్న లక్ష్యం కోసం శ్రమించారు.. అందుకుతగ్గ ఫలితం లభించింది.. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించిన నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం - వివరాలు 8లో▸

సేవా సంస్థలకు ప్రభుత్వ సహకారం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మైలార్‌దేవ్‌పల్లి: కుల మతాలకతీతంగా సేవలు అందిస్తున్న సామాజిక సంస్థలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గగన్‌పహాడ్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన 30వ అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక పరివర్తన కోసం ఎటువంటి లాభాపేక్ష లేకుండా మహవీర్ జైన్ సంస్థ పని చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులు, మహిళల సాధికారత కోసం, వైద్య సహకారం.. అవసరమైన వారికి మహవీర్ సంస్థ ఉచిత సేవలు ఎంతో శ్లాఘనీయమన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా మొదటి సంవత్సరం 19 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు మంత్రి తెలిపారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. నిరుపేదలు రూపాయి కూడా చెల్లించకుండా ఉచితంగా వైద్య సహాయం అందిస్తున్నట్లు వివరించారు. దేశ రాజ ధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం మూలంగా నివాసానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా క్లీన్‌అండ్ గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగర అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటా యించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో మహవీర్ జైన్ సంస్థ ప్రతినిధులు, అధికా రులు పాల్గొన్నారు.



మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

సంక్రాంతి నుంచి రైతుభరోసా

- సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ పథకం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: సంక్రాంతి పండుగ నుంచి సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ రైతు భరోస డబ్బులు జమ అవుతాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. భూమిలేని రైతులకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం మర్పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపల్లిలో రూ.45 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శిలాఫలకం వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీఓ రాజీ మల్లయ్య, ఆర్‌ఐ మాధవరెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, బ్లాక్ –2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, అనంత్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు రామేశ్వర్, ఖలిమొద్దీన్, శంకరయ్యగౌడ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

అనంతగిరి: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ రైతు భరోసా అందజేస్తుందన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి 12 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అంతకుముందుగా మార్కెట్ కమిటీ ఆవరణలో చేపట్టే పనులకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ చైర్పర్సన్ మంజుల రమేష్, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఎండీ రియాజ్, కార్యదర్శి ఎండీ ఫసియొద్దీన్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మైపాల్‌రెడ్డి, షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, రత్నారెడ్డి, ఆర్టీఏ మెంబర్ జాఫర్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా

విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్‌ఎస్‌ఏ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ 30 రోజులుగా ఎస్‌ఎస్‌ఏలు వికారాబాద్ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్నారు. శనివారం వికారాబాద్ పర్యటనలో ఉన్న ఆయన్ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్, సభ్యులు ప్రభావతి, శేఖర్, శ్రీశైలం, రవికుమార్, రాజేశ్వరి, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి భారీగా కేంద్రం నిధులు

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం చేయూత
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- నాగారంలో 4జీ బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు: కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణకు అధిక నిధులు కేటాయిస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ధారూరు మండలం నాగారం గ్రామంలో శనివారం బీఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ విజయకుమార్‌తో కలిసి 4జీ సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల వారికి 4జీ సేవలు ఎంతగానో ఉపయోగపడతామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో సైతం ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా వెనుకబడిందని అన్నారు. విద్యారంగానికి తక్కువ నిధులు కేయిస్తున్నారని ఆరోపించారు. మేడిపల్లి కలాన్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రైవేటుకు ధీటుగా మారిందని, అక్కడి హెచ్‌ఎం కృషితో ఇది సాధ్యమైందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని.. తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలని పేర్కొన్నారు. ధారూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాగారంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, బీఎస్‌ఎన్‌ఎల్ రాష్ట్ర అధికారులు సుదర్శన్, కుమారస్వామి, రాజారాం, మోహన్, రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, వడ్ల నందు, రాజునాయక్, వివేకానందరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వాలు

తాండూరు: దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది బీజేపీ సభ్యత్వం పొంది రికార్డు సృష్టించారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. సాయిపూర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సదుపాయాలను పరిశీలించారు. వంట గది, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండటంతో సిబ్బందిని అభినందించారు. బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులు మరణం పార్టీకి తీరనిలోటన్నారు. తాండూరులో ఆయన విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ బాలప్ప, సాహు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఎలక్ట్రికల్ వాహనాలదే

తాండూరు టౌన్: భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలో షేకాపురం ఆంజనేయులు ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలు వినియోగించనున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు మల్లేశం, శాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమృతాసాగర్‌కు సావిత్రిబాయి పూలే అవార్డు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన అమృతాసాగర్‌కు సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. అమృతాసాగర్ మహిళల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. సావిత్రిబాయి పూలే జయం త్యుత్సవాల సందర్భంగా ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానం చేసింది. ఈ మేరకు ఆమెకు మంత్రి సీతక్క, మాజీ ఎంపీ హనుమంత్‌రావు చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అమృతాసాగర్ మాట్లాడుతూ.. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

చించోడ్‌లో సంపూర్ణ మద్య నిషేధం

షాద్‌నగర్: మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా.. పేకాట ఆడినా.. ఎన్నికల్లో ఓట్ల కోసం మద్యం పంపిణీ చేసినా జరిమానా విధించాలని ఆ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళా సంఘాల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పేకాట, మద్యపానాన్ని నిషేధించాలని తీర్మానించారు. మద్యం అమ్మిన వారికి రూ.50వేలు, కొనుగోలు చేసిన వారికి రూ.25వేలు, పేకాట ఆడిన వారికి రూ.50వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. దీనిని ఎవరైనా వ్యతిరేకిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకు మద్యం పంపిణీ చేసే నాయకులు, వారికి సహకరించే వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తామని తీర్మానంలో పేర్కొన్నారు.

చేయూతనిస్తే.. పతకం తెస్తా

సీఎం కప్ స్టేట్ విన్నర్ నీరటి అంజలి

- వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటుతున్న పేదింటి బిడ్డ
- జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కుల్కచర్ల: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తనదైన ప్రతిభను చాటుతూ దూసుకెళ్తోంది వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన విద్యార్థి నీరటి అంజలి.ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో అద్భుతమైన సత్తాచాటింది. హకీంపేట్ క్రీడా పాఠశాల తరఫున ప్రాతినిథ్యం వహించిన అంజలి అండర్– 19 వెయిట్ లిఫ్టింగ్ 59 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. గత జులైలో మధ్యప్రదేశ్, నవంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్ తదితర ప్రాంతాల్లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ విశేషంగా రాణించింది. ఈనెల 6న ఒడిశాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొనేందుకు సిద్ధమైంది.

కుటుంబ నేపథ్యం

అంజలి ప్రస్తుతం హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు లక్ష్మి, శివరాజ్‌ల రెండో కూతురు. వీరిది వ్యవసాయ కుటుంబం. తల్లి లక్ష్మి మహిళా సమాఖ్యలో ఎంఏసీసీగా పనిచేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

అంజలి తండ్రి శివరాజ్ ఐదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి వీరి కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఒక్కో రాష్ట్రంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. ఈనెల 6న ఒడిశాలో జరిగే పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దాతలు చేయూతనిస్తే రాష్ట్రానికి పతకం తెస్తానని అంజలి ధీమా వ్యక్తంచేస్తోంది.



సీఎం కప్ పోటీలలో 59కేజీల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న అంజలి



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న క్రీడాకారిణి

టార్గెట్ ఒలింపిక్స్..

ప్రస్తుతం 59కేజీల విభాగంలో రాణిస్తున్న అంజలి తన టార్గెట్ ఒలింపిక్స్ అని చెబుతోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాగుతున్నానని, కానీ పేదరికం తన సంకల్పానికి అడ్డుపడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తోంది. ఆర్థికంగా ప్రోత్సహించేవారు ఉంటే ఎంతటి కష్టాన్నయినా ఎదుర్కొని దేశానికి పేరు తెస్తానని పేర్కొంటోంది. అంజలి తండ్రి శివరాజ్ ఫోన్ పే: నంబరు 9666880366ను సంప్రదించాలని కోరారు.

ఆరుగురిలో ముగ్గురు టీచర్లు..


ఆరుగురు అక్కాచెల్లెళ్లు

అనంతగిరి: నవాబుపేట మండలం మీనపల్లి కలాన్‌కు చెందిన రాములు, అనంతమ్మలకు ఆరుగురు కూతుళ్లు. వీరిలో రెండో కూతురు మహేశ్వరి పూడూర్ మండలం చీలాపూర్‌లో, నాలుగో కూతురు మంజుల మర్పల్లికలాన్‌లో, ఐదో కూతురు పూలమ్మ పులుమామిడిలో టీచర్లుగా పనిచేస్తున్నారు. మూడో కూతురు విజయ నాగర్‌కర్నూల్‌లో నర్స్‌గా, పనిచేస్తున్నారు. చిన్న కూతురు హేమలత ప్రస్తుతం డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నారు.

ముగ్గురూ ముగ్గురే..


స్వప్న-కవిత-జ్యోతి

అనంతగిరి: దోమ మండలం దొంగఎన్కెపల్లికి చెందిన పద్మమ్మ, వెంకట్‌రెడ్డి దంపతులకు ముగ్గురూ అమ్మాయిలే. వ్యవసాయం చేసి, పిల్లలను బాగా చదివించారు. వీరిలో పెద్ద కూతురు స్వప్న ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఉపాధ్యాయురాలిగా, కవిత చేవెళ్లలోని జ్యోతిబాపూలే పాఠశాలలో జేఎల్‌గా, మూడో కూతురు జ్యోతి ధారూరు మండలం పీసీఎం తండాలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మొక్కవోని సంకల్పం


టీచర్ అరుణ

కుల్కచర్ల: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన జగన్, లక్ష్మమ్మ దంపతుల కూతురు అరుణ. చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు.. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటూ ఇంటర్ పూర్తి చేసింది. పిల్లలకు ట్యూషన్ చెబుతూ డైట్ పూర్తి చేసి ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం మండలంలోని పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది.

ముగ్గురిలో ఇద్దరు..


విజయలక్ష్మి-స్వాతి-ఐశ్వర్య

అనంతగిరి: ధారూర్ మండల కేంద్రానికి చెందిన సత్యమ్మ- రత్నయ్యలకు ముగ్గురు అమ్మాయిలు, ఓ అబ్బాయి సంతానం. వ్యవసాయ భూమి లేకపోవడంతో కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివించారు. వీరిలో విజయలక్ష్మి నవాబుపేటలో, ఐశ్వర్య పెద్దేముల్ మండలం ఊరెంటి తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయినులుగా పనిచేస్తున్నారు. మరో కూతురు స్వాతి దోర్నాలలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

డబుల్ ధమాకా..


నిఖత్ ఉన్నీసా, షాహీన్ ఉన్నీసా

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎల్‌ఐజీ కాలనికి చెందిన మహ్మద్ సాబేర్ ప్రైవేటు ఉద్యోగి. ఈయనకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు సంతానం. కూతుళ్లు నిఖత్ ఉన్నీసా, షాహీన్ ఉన్నీసా గత డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. నిఖత్ ఉన్నీసా ప్రస్తుతం కోట్‌పల్లి మండలం ఇందోల్‌లో, షాహీన్ ఉన్నీసా బషీరాబాద్ మండలం మైల్వార్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

సావిత్రి స్ఫూర్తి.. ఉపాధ్యాయ కీర్తి

సండే స్పెషల్



మేనమామల ప్రోత్సాహంతో..


రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంటున్న మాధురి

యాలాల: వికారాబాద్ మండలం ఆలంపల్లికి చెందిన మాధురి చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు చనిపోయారు.. మేనమామలు చేరదీసి చదివించారు.. వారి శ్రమ వృథా కారాదని పట్టుదలతో చదివింది.. 1988లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీచర్‌గా నిలిచింది.. తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచింది. మేనమామలు బస్వరాజ్, బస్వలింగం, రాజేశ్వర్ ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొంది. తనకు బాల్యంలో పాఠాలు చెప్పిన మల్లయ్య టీచరును ఆదర్శంగా తీసుకొని ఈ స్థాయికి ఎదిగినట్లు మాధురి తెలిపారు. గతేడాది పదోన్నతిపై జీహెచ్‌ఎంగా దేవనూరు ఉన్నత పాఠశాలకు వచ్చారు. 2016లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు.

అక్కాచెల్లెళ్లంతా టీచర్లే..


అక్కా చెల్లెళ్లు పద్మజ, గీత, కవిత

బొంరాస్‌పేట: దౌల్తాబాద్ మండల నందారానికి చెందిన నాగమణి, గోపాల్‌రెడ్డి దంపతులకు ముగ్గురు కూతుళ్లు పద్మజ, గీత, కవిత. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు కష్టపడి చదివి ప్రభుత్వ టీచర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లిదండ్రుల కష్టానికి తగిన గుర్తింపు తెచ్చారు. ప్రస్తుతం ముగ్గురూ కొడంగల్ నియోజవర్గంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

భర్త చనిపోయిన బాధను దిగమింగి..


పాఠాలు బోధిస్తున్న అనురాధ

పరిగి: వికారాబాద్ పట్టణానికి చెందిన అనురాధ భర్త 1997లో చనిపోయాడు.. అప్పటికే ఆమెకు ఇద్దరు చిన్న పిల్లలు.. భర్త లేడన్న పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనుకుంది. కష్టపడి చదువుకుంది. 2008 డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం వికారాబాద్ ఎంపీపీఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

వైకల్యాన్ని జయించి..


జగ్గమ్మ

బషీరాబాద్: మండలంలోని మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన మాల బిచ్చప్ప, మాణిక్యమ్మ దంపతుల కూతురు జగ్గమ్మ. ఏడాది వయస్సులో పోలియో బారిన పడి కాలు చచ్చుబడింది.. చదువుపై మక్కువతో సొంత గ్రామంలో 5వ తరగతి వరకు చదువుకుంది.. బషీరాబాద్ జెడ్పీ బాలికల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకుంది. తాండూరులో ఇంటర్, వికారాబాద్‌లో డీఎడ్ పూర్తి చేసింది. అంగవైకల్యంతో అంతపెద్ద చదువులు చదువుతావా..? అని వెక్కిరించిన గొంతుకలకు సమాధానం చెప్పాలనుకుంది.. కష్టపడి చదువుకుంది.. 2012 డీఎస్సీలో ఎస్జీటీ టీచర్‌గా ఉద్యోగం సాధించింది. ఆడవాళ్లు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నిరూపించింది. ప్రస్తుతం బషీరాబాద్ మండలం నవల్గా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తోంది.

తండ్రిబాటలో నలుగురు..


ఉద్యోగాలు సాధించిన కూతుళ్లతో తల్లిదండ్రులు

తాండూరు రూరల్: తాండూరు పట్టణం సాయిపూర్ భవానీనగర్‌కు చెందిన హన్మయ్య, సూర్యకళ దంపతులకు ఆరుగురు ఆడపిల్లలు.. హన్మయ్య మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి 2017లో ఉద్యోగ విరమణ పొందారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించారు.. ప్రస్తుతం వారు ప్రభుత్వ ఉద్యోగులు సాధించారు.. మొదటి కూతురు సీహెచ్ సంధ్యారాణి (ఎస్ఏ, ఫిజికల్ సైన్స్), స్వరూపరాణి (ఆర్ట్ టీచర్, మెనార్టీ రెసిడెన్షియల్ స్కూల్), భార్గవి(ఏఈఈ, పంచాయతీ రాజ్ విభాగం), అర్చన(పంచాయతీ కార్యదర్శి, ఇందర్‌చెడ్), అశ్విని(ఎస్జీటీ, ఇందూర్ పాఠశాల), హరిక (ఎస్జీటీ) బాగాయిపల్లిలో టీచర్‌గా పని చేస్తున్నారు.

అమ్మే ఆదర్శం..


టీచర్ ప్రియాంక

పరిగి: మాది కుల్కచర్ల మండలం గట్టనపల్లి.. నేను చిన్నగా ఉన్నప్పుడు అమ్మ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేది.. తాను కూడా తల్లిలా టీచర్ కావాలనుకున్నా.. అమ్మే నాకు ఆదర్శం అని ప్రియాంక తెలిపింది.. కష్టపడి చదివి 2017లో టీచర్ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఇప్పాయిపల్లిలో విధులు నిర్వహిస్తోంది.. కష్టపడితే ఏదైనా సాధ్యమని అంటోంది.

పేద కుటుంబంలో పుట్టి..


ఆలేడ్‌లో పాఠాలు బోధిస్తున్న గౌతమి

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన గౌతమి, ప్రసన్నలక్ష్మి అక్క చెల్లెల్లు. వారిని తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఇద్దరూ 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేశారు. ప్రస్తుతం గౌతమి దుద్యాల్ మండలం ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తుండగా.. ప్రసన్నలక్ష్మి కొడంగల్ మండల రుద్రారం పాథమిక పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది.


రుద్రారంలో బోధిస్తున్న ప్రసన్నలక్ష్మి

నాన్నను కోల్పోయినా..


తల్లి పార్వతమ్మతో శశివర్ధ

బొంరాస్‌పేట: తాండూరుకు శశివర్ధ చిన్నతనంలోనే నాన్నను కోల్పోయారు. దీంతో అన్నీ తానై అమ్మే చదివించింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా తల్లి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివారు. చివరికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం బొంరాస్‌పేట మండలంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

మరో ఐదు పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


పీఏసీఎస్ చైర్మన్‌లు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: సాగు పెట్టుబడులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు నియోజకవర్గంలో కొత్తగా ఐదు వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నగరంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, జిల్లా కోఆపరేటీవ్ అధికారి నాగలింగాచారి, నియోజకవర్గంలోని వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లు, మేనేజర్‌లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రైతులకు పంట పెట్టుబడులకు సత్వర రుణాలను అందించాలంటే కొత్తగా ఐదు సహకార సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందని అధికారులకు తెలిపారు. గతంలో ప్రతీ మండలానికి రెండు మూడు సహకార సంఘాలు ఉండేవన్నారు. బషీరాబాద్ మండలంలో నవాంద్గి వ్యవసాయ సహకార సంఘం నుంచి కాశింపూర్‌లో పీఏసీఎస్, యాలాల మండలంలోని పగిద్యాల, తాండూరు మండలంలో కరన్‌కోట్‌లో, పెద్దేముల్ మండలంలోని మంబాపూర్ గ్రామంలో, కోట్‌పల్లి మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేయనునన్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా అధికారులతో మంత్రి పొన్నం వీడియో కాన్ఫరెన్స్


జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

అనంతగిరి: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని.. ప్రతీ ఒక్కరి రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రతా వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన ఆర్‌అండ్‌బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి హైదరాబాద్ నుంచి రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. గతంలో కేంద్రం ప్రభుత్వం నిర్వహించే ఈ వారోత్సవాల ప్రాధాన్యత దృష్టిలో ఉంచుకుని ప్రతీ శాఖను భాగస్వామ్యం చేస్తూ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు చేపడుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ప్రతీ గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్టీఓ వెంకట్ రెడ్డి, ఈఈ రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రవణ్ ప్రకాశ్, ఆర్టీసీ డీఎం అరుణ, మైన్స్ ఏడీ సత్యనారాయణ, డీఈఓ రేణుక దేవి, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' ట్యాంకు ప్రారంభానికి సన్నాహాలు

ప్రధాన పైప్‌లైన్ పనులకు సర్వే చేపట్టిన అధికారులు


పైపులైన్ పనుల సర్వేను పరిశీలిస్తున్న ఏఈ శ్రీనాథ్‌రెడ్డి

దుద్యాల్: మండల పరిధిలోని సంట్రకుంట తండా పంచాయతీ పరిధిలోని నాన్యా నాయక్ తండాలో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ప్రారంభించేందుకు మిషన్ భగీరథ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకుగాను శనివారం మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా లేక ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉంది. ప్రధాన పైపులైన్ నుంచి ఈ ట్యాంకుకు వచ్చే నీటి సరఫరా లైన్ వేయాల్సిన సమయంలో రైతులు పంటలు వేయడంతో పైపులైన్ పనులు చేపట్టేందుకు ఇబ్బంది తలెత్తిందన్నారు. ప్రస్తుతం రైతులు పంటలు కోసేయడంతో పైపులైన్‌పనులకు సర్వే పూర్తి చేశామన్నారు. ఈ సర్వేలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వ్యవసాయ గణన

వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్: రైతుల సమగ్ర వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి మండల వ్యవసాయాధికారులకు సూచించారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల వ్యవసాయాధికారులతో అగ్రికల్చర్ సెన్సెస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన కార్యక్రమం చేపడుతోందని.. 2021లో కోవిడ్ కారణంగా నిలిచిపోయిన ప్రక్రియ ఏడాది నిర్వహించాలని ఆదేశాలందాయని చెప్పారు. ఈ గణనలో సామాజిక వర్గాల వారీగా రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణం, సాగయ్యే పంటల వివరాలు నమోదు చేయాలన్నారు. వీటితో పాటు నీటి వినియోగం, వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాల విషయాలు తెలుసుకోవాలన్నారు. క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్, ఆయిల్‌పామ్ సాగు తదితర అంశాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు కొమరయ్య, పవన్, శ్వేత, అనిత, టెక్నికల్ ఏఓ హిమబిందు, ఏఈఓలు పాల్గొన్నారు.


వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్

బంట్వారం: సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలియని వారి నుంచి ఎవరికైనా డబ్బులు వస్తే వెంటనే యూపీఐ యాప్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకోవద్దన్నారు. మెసేజ్‌లో కనిపించే లింక్స్‌ను ఓపెన్ చేయొద్దని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించకూడదన్నారు. సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో చేస్తున్న మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

అన్ని అంశాలపై అవగాహన తప్పనిసరి

డీఆర్‌డీఓ శ్రీనివాస్


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

అనంతగిరి: డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సంస్థకు చెందిన అన్ని అంశాలపై తగిన అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామ సంఘం, మండల సమాఖ్యల ఉప విధులు, నిబంధనావళిపై ఏపీఎం, సీసీలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి, సిబ్బంది ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహించి సంస్థ అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. వికారాబాద్, తాండూర్, పరిగి క్లస్టర్ సిబ్బందికి ఈనెల 7, 8, 9 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ, డీపీఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

దోమ: కట్టమైసమ్మ ఆలయంలో చోరీ కేసులో ఓ నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈ నెల 2న అర్ధరాత్రి మోత్కూరు గేటు సమీపంలో కట్టమైసమ్మ ఆలయంలో ఓ దుండగుడు హుండీ చోరీకి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ కనపడకపోవడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బడేంపల్లికి చెందిన దుద్యాల వెంకటయ్య చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా.. హుండీలోని డబ్బు తీసుకుని ఐనాపూర్ చెరువులో హుండీ వేసినట్లు ఒప్పుకొన్నాడు. ఈ మేరకు శనివారం నిందితుడి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. గతంలో పలు చోరీల్లో కేసులున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పాఠం చెప్పేదెవరు..?

- నమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు
- కేజీబీవీల్లో సాగని తరగతులు
- పూర్తికాని సిలబస్.. సమీపిస్తున్న పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు


దౌల్తాబాద్: సమ్మెలో కేజీబీవీ టీచర్లు

దౌల్తాబాద్: డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో కేజీబీవీల్లో పాఠాలు చెప్పే వారు కరువయ్యారు. దీంతో విద్యార్థినులు సిలబస్ పూర్తవుతుందో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది కేజీబీవీలోని ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలో పాల్గొంటున్నారు. కేజీబీవీలో విద్యార్థులకు భోజనం తదితర విషయాల్లో అసౌకర్యం కలగకుండా నాన్‌టీచింగ్ సిబ్బందితో నెట్టుకొస్తుండగా భోధనపై ప్రభావం పడుతోంది. ఎఫ్‌ఏ-3 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో తరగతులు నిర్వహించాల్సి ఉండగా ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడంతో కేజీబీవీ విద్యార్థులకు సబ్జెక్టులు పూర్తిగా వెనుకబడిపోవడంతో పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపనుంది.

ప్రత్యామ్నాయ చర్యలు..

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ చర్యలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ప్రతి రోజు కేజీబీవీ సందర్శించి సమయం, భద్రత, నాణ్యమైన ఆహారం అందించడంలో అంతరాయం కలగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పదుల సంఖ్యలో ఉండే కేజీబీవీ టీచర్ల స్థానంలో ఒకరిద్దరి ఉపాధ్యాయులతో భోధన ఎలా సాధ్యమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పదో తరగతి సిలబస్ ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

విద్యార్థులపై సమ్మె ప్రభావం: జానకిరాం చౌహాన్

కుల్కచర్ల: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ప్రభావం విద్యార్థులపై పడుతోందని దిశ కమిటీ సభ్యుడు జనకీరాం చౌహాన్ అన్నారు. శనివారం ఆయన బీజేపీ నేతలతో కలిసి మండల కేంద్రంలో కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా జానకీరాం చౌహాన్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కారణంగా నెల రోజులగా విద్యార్థులకు పాఠాలు బోధించే వారు కరువయ్యారన్నారు. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత తగ్గే ప్రమాదం ఉంటుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి గణిత బోధకుడు లేక పోవడం వారి విద్యాజీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రలింగం, మండల ఉపాధ్యక్షుడు మైపాల్, కుల్కచర్ల, చౌడాపూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, జ్యోతి, మహిళా మోర్చా నుంచి సామ్యారెడ్డి ఉన్నారు.


కుల్కచర్ల: విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న దిశ కమిటీ సభ్యుడు జానకీరాం చౌహాన్

రూ.26 కోట్లతో వంద పడకల ఆస్పత్రి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పరిగి ప్రభుత్వాస్పత్రిని 30 పడకల సామర్థ్యం నుంచి వంద పడకలకు పెంచేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం వెంటనే రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. దీంతో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రతీ నియోజకవర్గంలో ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నిధులతో ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, డీసీహెచ్ఓ ప్రదీప్‌కుమార్, సూపరింటెండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.